


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 30 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 332 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలపై ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సంస్థలు నాలుగు ప్రతిపాదనలు సమర్పించగా, వాటి ఖర్చులు, అనుకూల-ప్రతికూల అంశాలపై ప్రభుత్వం లోతుగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తో జరిగే సమీక్ష సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌ల పునరుద్ధరణ పనులకు సంబంధించి అవసరమైన పరీక్షలను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి 1.5 మీటర్ల దూరంలో ఎస్‌పీటీ పరీక్షలు, ప్రతి 3 మీటర్ల దూరంలో పెర్మిబిలిటీ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. బోర్లు వేస్తున్నప్పుడు రాయి వచ్చినా ఐదు మీటర్ల లోతు వరకు తవ్వాలని తెలిపారు. పునరుద్ధరణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఎన్‌డీఎస్‌ఏకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

## మంత్రి శ్రీధర్ బాబు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: హైదరాబాద్‌ను 'గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ హబ్'గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీ) కేవలం బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, వాటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా (జీవీసీ) మార్చేందుకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో హైనెకెన్ సంస్థ ఏర్పాటు చేసిన 'హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా' కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అనుకూల పారిశ్రామిక విధానాల కారణంగా అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన ఈ కేంద్రం ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ, అనలిటిక్స్ రంగాల్లో సేవలు అందిస్తుందని, ప్రారంభ దశలో 300 మందికి ఉద్యోగాలు లభించగా భవిష్యత్తులో 1600 మందికి చేరుకుంటుందని వివరించారు. తెలంగాణను గ్లోబల్ నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, హైనెకెన్, యూబీఎల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో టీజీఎంఆర్ఈఐఎస్ ఘన విజయం – 98% ఉత్తీర్ణత, 126 పాఠశాలలకు 100% ఫలితాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎంఆర్ఈఐఎస్) 2026 ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 204 పాఠశాలల్లో 126 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం. ఈ ఫలితాలు బలమైన విద్యా పునాది, నాణ్యమైన బోధన, విద్యార్థి కేంద్రిత విధానాల ఫలితమని అధికారులు తెలిపారు. మొత్తం 197 పాఠశాలలు 500 మార్కులకు పైగా సగటు సాధించగా, 45 పాఠశాలలు 570 మార్కులకు పైగా సగటు మార్కులు నమోదు చేశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖులు మొహమ్మద్ అజరుద్దీన్, మొహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. టాప్ 10లో జి. మౌన్య శ్రీ 591 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, మొహమ్మద్ రెహాన్ 589 మార్కులతో ద్వితీయ స్థానం, ఎం. పూజిత్ 589 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అలాగే పఠాన్ రేహానా, డి. అనాస్ అలీ, సింగం శ్రీజ, మొహమ్మద్ ఉమ్మయ్యా తరన్నుమ్, మైమూనా మదీహా, టి. తరుణ్ కుమార్ తదితరులు ప్రతిభ కనబరిచారు. నిరంతర అకాడమిక్ పర్యవేక్షణ, ప్రత్యేక మార్గదర్శకత్వం, రిమీడియల్ కోచింగ్, పరీక్షా శిక్షణ, మానసిక ఆరోగ్య సహాయక కార్యక్రమాల వల్ల ఈ విజయాలు సాధ్యమయ్యాయని టీజీఎంఆర్ఈఐఎస్ వెల్లడించింది.



# హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ స్వాధీనం ఎల్ అండ్ టీతో ఒప్పందం పూర్తి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: ఇప్పటివరకు ఎల్ అండ్ టీ ఆధీనంలో ఉన్న హైదరాబాద్ మెట్రో రైల్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు ఎల్ అండ్ టీతో జరిగిన షేర్ పర్చేజ్ ఒప్పందం ప్రకారం LTMRHLకు చెందిన వంద శాతం షేర్లను రూ.1,461.47 కోట్ల ఈక్విటీ విలువకు ప్రభుత్వం స్వీకరించింది. ఈ ఒప్పందంపై హెచ్‌ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డి.కె.సేన్, LTMRHL ప్రతినిధి కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం రూ.13,538.53 కోట్ల అప్పును రాష్ట్ర ప్రభుత్వ హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మూడు కారిడార్లలో నడుస్తున్న మెట్రో ద్వారా రోజుకు సుమారు 4.5 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 86 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈ స్వాధీనం ద్వారా ఫేజ్–I, ఫేజ్–II విస్తరణ పనులు, ప్రణాళిక, సేవల అమలులో సమన్వయం సాధ్యమవుతుందని ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్‌లో మరింత సమగ్ర, ఆధునిక మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయని భావిస్తోంది. ఈ ఒప్పందానికి ముందు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష – ఉన్నతాధికారుల హాజరు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఎంసీహెచ్‌ఆర్‌డీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్‌తో పాటు ఐఎస్బీ ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ సామర్థ్యం, నిర్మాణ ఎత్తు, సాంకేతిక అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చే విధంగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# స్కాలర్‌షిప్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం – డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్ నిధుల సమస్యపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. బుధవారం ప్రజాభవన్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన స్కాలర్‌షిప్‌ల పెండింగ్ కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను త్వరగా క్లియర్ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైన నిధులను సమకూర్చే దిశగా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మే 21 నుండి జూన్ 1 వరకు సరస్వతీ అంత్య పుష్కరాలు – కాళేశ్వరంలో భారీ ఏర్పాట్లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుండి జూన్ 1 వరకు 12 రోజులపాటు కాళేశ్వరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి పుష్కరాల పోస్టర్, అధికారిక టీజర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రూ.30.63 కోట్లతో 162 అభివృద్ధి పనులు చేపట్టామని, సుమారు 30 లక్షల భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి, ప్రశాంత వాతావరణంలో పుష్కర స్నానం, దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ మొదటి రోజు ఉదయం 5:43 గంటలకు పుష్కర స్నానం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి రోజు త్రివేణి సంగమం వద్ద సాయంత్రం 6:30 గంటలకు కాశీ పండితుల హారతి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, కాళేశ్వరం ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## పక్కాగా జనగణన, సజావుగా ధాన్యం కొనుగోలు చేయాలి

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పక్కాగా జనగణన జరగాలని, ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలో డోర్ టు డోర్ తిరిగి జనగణన తీరును పరిశీలించిన ఆయన, అనంతరం ఫ్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణనను పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజల నుంచి సమగ్ర సమాచారం సేకరించాలని, ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రంలో తూకం ప్రక్రియను పరిశీలించి, రైతులకు న్యాయం జరిగేలా సరిగా తూకం వేయాలని, ఎలాంటి అవకతవకలు లేకుండా ధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం ఘనంగా



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: నర్సాపూర్ పట్టణంలోని 5వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మి రాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలకు సొంత ఇల్లు కల నెరవేరుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వార్డుల కౌన్సిలర్లు పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఆనందం వ్యక్తం చేశారు.

## పదో తరగతిలో మండల్ టాపర్‌గా అక్షయ ప్రతిభ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం అస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన అక్షయ పదో తరగతి ఫలితాలలో మండల్ అగ్రస్థానాన్ని సాధించి కుటుంబానికి ఆనంద క్షణాలను అందించింది. తమ కూతురు కష్టపడి చదివి టాపర్‌గా నిలవడంతో తల్లిదండ్రులు అపార గర్వంతో నిండిపోయారు. ఆమె విజయాన్ని సంతోషంగా జరుపుకుంటూ స్వీట్లు పంచిపెట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ అక్షయ సాధించిన విజయానికి ఆమె క్రమశిక్షణ, పట్టుదల ముఖ్య కారణమని, చిన్ననాటి నుంచే చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించామని తెలిపారు. అలాగే ఆమెకు అవసరమైన సహకారం అందించిన ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మరియు ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



## చిల్వార్ గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం, సైబర్ క్రైమ్‌పై అవగాహన

సందేశం టైమ్స్, మెదక్ / అల్లాదుర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్లాదుర్గం మండలం చిల్వార్ గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాలు నిర్వహించడంతో పాటు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్, తహసిల్దార్ మల్లయ్య, ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, ఎస్సై శంకర్, డాక్టర్ సారిక, సీడీపీఓ నగమణి, ఎంపీవో గంగారం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, సర్పంచ్ శశి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లింగప్ప, సీనియర్ నాయకులు సుభాష్ రావు, బయిరాన్ దిబ్బ సర్పంచ్ వీరన్న, ఐబీ తండా సర్పంచ్ శంకర్ నాయక్, జీకే తండా సర్పంచ్ మాన్య నాయక్, మందాపూర్ సర్పంచ్ రమ్య బుమ్ రెడ్డి, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి అంజ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజాగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సాయిబాబా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, శేఖర్ పటేల్, ఉప సర్పంచ్ లక్ష్మి నర్సింలు, తుకారాం, మల్లయ్య, బలరాజ్, రమేష్, అంగన్వాడీ అధ్యాపకులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారుల రక్షణ, హక్కులు, అలాగే సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించే విధానాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## పదో తరగతిలో 580 మార్కులతో పంపటి మౌనిక ప్రతిభ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఖంజామల్ల్పూర్ గ్రామానికి చెందిన పంపటి మౌనిక పదో తరగతి ఫలితాలలో 580 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ఆమె తల్లిదండ్రులు పంపటి స్వప్న, ఎల్లప్ప తమ కూతురు సాధించిన విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నిజాంపేట్ బచుపల్లి ప్రాంతంలో నివసిస్తూ తెలంగాణ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో చదువుతున్న మౌనిక రెగ్యులర్‌గా మంచి ర్యాంక్ సాధించడం గ్రామానికి గర్వకారణంగా మారింది. ఆమె కృషి, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించిందని గ్రామస్తులు అభినందిస్తున్నారు.




## తాడుమన్నూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: అందోల్ మండలం తాడుమన్నూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అందోల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అందోల్ మండల అధ్యక్షుడు శివరాజు దాకూర్, మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు పట్లోళ్ల హనుమంత రెడ్డి, బోయిని నరసింహులు, సలావుద్దీన్, షకీల్, మొగులయ్య, కంతి కిష్టయ్య, దశరథ్, దేవయ్య, కాంగ్రెస్ పార్టీ యువ అధ్యక్షుడు పట్ల వీరారెడ్డి, మల్లేశం, శివకుమార్, దశరథ్ రాఘవేందర్, ఖదీర్, గ్రామ సర్పంచ్ అనిల్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతులకు సకాలంలో మద్దతు ధరతో పంట కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు.



## స్థంబాద్రి లక్ష్మి నరసింహ స్వామి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల

సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 30, ప్రతినిధి: ఖమ్మం పట్టణంలోని స్థంబాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించే అదృష్టం కలిగిందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని స్వామి వారి దయ కోరినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రైతాంగానికి కరువు కాటకాలు రాకుండా ఉగ్ర నరసింహ స్వామి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.

## నాగులవంచలో టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమం



సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 30, ప్రతినిధి: చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామ పంచాయతీ కార్యాలయంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలు, జిల్లా క్షయ అధికారి సూచనల మేరకు మండల వైద్యాధికారి అల్తాఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా డిజిటల్ హ్యాండిల్ ఎక్స్‌రేలు నిర్వహించి 68 మంది అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేపట్టారు. అదేవిధంగా తెమ్మడ పరీక్షలు నిర్వహించి, ఇతర చిన్న వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి పరీక్షలు, చికిత్స ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని, ఇది పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని వైద్యులు తెలిపారు. టిబి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ నారగాని రాంబాయి గ్రామాన్ని టిబి రహిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని సూచించగా, ఉప సర్పంచ్ శరత్ కూడా క్షయ వ్యాధి త్వరగా నయం అయ్యే వ్యాధి అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వీరేందర్, సూపర్వైజర్ కృష్ణారావు, టిబి సూపర్వైజర్ ఇమామ్, మహేష్, కృష్ణవేణి, వెంకట్, గంటయ్య, పీడీఎఫ్ వేణుమాధవ్, సిస్టర్స్ లలిత, నర్సమ్మ, ఆశలు చిన్న కవిత, పెద్ద కవిత, ఉమా, నాగేంద్ర, సుజాత, రేణుక కుమారి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని మండలంలో పదో తరగతి ఫలితాల్లో 98.28% ఉత్తీర్ణత



సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 30, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చింతకాని మండలం 98.28 శాతం ఉత్తీర్ణత సాధించి విజయదుందుభి మోగించింది. 2025-26 విద్యాసంవత్సరంలో మండలంలో మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 344 మంది ఉత్తీర్ణులయ్యారు. కోదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థి అబ్దుల్ కలాం 585 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, పందిళ్ళపల్లి హైస్కూల్ విద్యార్థిని వర్షశ్రీ 564 మార్కులతో ద్వితీయ స్థానం, కేజీబీవీ చింతకాని విద్యార్థిని అక్షయ 561 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో 8 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించగా, మిగిలిన 5 పాఠశాలలో ఒక్కొక్క విద్యార్థి అనుత్తీర్ణులయ్యారు. మూడు ప్రైవేటు పాఠశాలలో హాజరైన 84 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు నమోదు చేశారు. గ్లోబల్ పాఠశాలలో డి. అభిషేక్ 576 మార్కులు, సెయింట్ థెరిస్సా పాఠశాల నుండి సుమైత్రి 562 మార్కులు, శ్రీ ఆదర్శ విద్యాలయం నుండి జె. భాను ప్రసాద్ 550 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ విజయంపై చింతకాని మండల ఎంఆర్వో బాబ్జీ ప్రసాద్, ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాసరావు, అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు అభినందనలు తెలియజేస్తూ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల కృషిని ప్రశంసించారు.

# జనగణన-2027కు సిబ్బందికి శిక్షణ పూర్తి




సందేశం టైమ్స్, చింతకాని మండలం, ఏప్రిల్ 30, ప్రతినిధి: త్వరలో జరగబోయే జనగణన-2027 కార్యక్రమానికి సంబంధించి చింతకాని మండలానికి కేటాయించిన సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. ఈ శిక్షణను ఏప్రిల్ 24 నుండి 29 వరకు రెండు బ్యాచ్‌లుగా ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మండలంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ సిబ్బందికి సూచించారు. అలాగే మండల ప్రజలు జనగణనకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈఓ, ఎంపీఎస్ఓ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ట్రైనర్లు శివ నారాయణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నూతన గృహప్రవేశ వేడుకలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యుల సందడి

సందేశం టైమ్స్, జహీరాబాద్, ఏప్రిల్ 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్‌కల్ మండల కేంద్రానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా మండల అధ్యక్షుడు నవీన్ కుమార్ నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, కమిటీ సభ్యులు విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టు విఠల్ తదితరులు హాజరై నవీన్ కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ఆకాంక్షిస్తూ, నవీన్ కుమార్ సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని అభినందించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా బంధుమిత్రులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతకు సువర్ణావకాశం – మే 8న సంగారెడ్డిలో మెగా జాబ్ మేళా



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 30, ప్రతినిధి: జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ శాఖ ఆధ్వర్యంలో మే 8న సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, అర్హత కలిగిన యువత ముందస్తుగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేళా ద్వారా పలు ప్రైవేట్ సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి కల్పనలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా యువజన సేవల అధికారి అఖిలేష్ రెడ్డి, డీఐసీ జీఎం తుల్జా నాయక్ తదితరులు పాల్గొన్నారు

# తాగునీరు, పారిశుద్ధ్యం, సేవలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 30, ప్రతినిధి: జిల్లాలో తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజా సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుంచి సబ్ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రూట్లలో ప్రారంభం, ముగింపు బోర్డులను 15 రోజుల్లో ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే 1916 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని తెలిపారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా పర్యవేక్షణ చేయాలని, సాదా బైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ మెంబర్స్, జనన, మరణ ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, మున్సిపల్, గ్రామ పంచాయతీల నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రధాన రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం నివారించేందుకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రతి అధికారి వారానికి కనీసం రెండు సార్లు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, హౌసింగ్ పీడీ చలపతిరావు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# పారిశ్రామిక అనుమతులకు వేగం పెంచాలి – కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 30, ప్రతినిధి: జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ టీజీఐపాస్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన టీజీఐపాస్ (TS-iPASS) సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులపై సమగ్రంగా చర్చించారు. పరిశ్రమలకు సంబంధించిన కోల్, ఇథనాల్ ముడి పదార్థాల కేటాయింపుపై సమీక్షించి ఒక కోల్ అప్లికేషన్‌కు అనుమతి మంజూరు చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా టీ-ప్రైడ్ కింద ఐదు సబ్సిడీ దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, పరిశ్రమల శాఖ జీఎం తుల్జా నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 30, ప్రతినిధి: జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్‌తో కలిసి రోడ్డు భద్రత అంశాలపై సమీక్షించి, గత సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కు సూచించిన పనుల పురోగతిని ఆరా తీశారు. ముఖ్యంగా నేషనల్ హైవే–65 పై నిర్వహణ లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. యూ-టర్న్‌ల వద్ద భద్రతా చర్యలు, సరిపడా లైటింగ్, రేడియం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చేవెళ్ల ఘటన అనంతరం నేషనల్ హైవేపై సీజ్ చేసిన వాహనాల వివరాలను సమర్పించాలని రవాణా అధికారిని ఆదేశించారు. అలాగే ప్రధాన రహదారులపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో పారిశుద్ధ్య పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, స్పీడ్ కంట్రోల్, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్ అండ్ బి, పోలీస్, మున్సిపల్, హెల్త్ శాఖల అధికారులు, నేషనల్ హైవే ప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్ష సూచనల నేపథ్యంలో ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 30, ప్రతినిధి: వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మండల కేంద్రంలోని గాంధీ నగర్ పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వర్షం కారణంగా ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు కప్పి ఉంచడం, మిల్లులకు తరలించే లారీలు, వాహనాలపై కూడా టార్పాలిన్లు ఉపయోగించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అనంతరం నవరత్న పార్బాయిల్డ్ రైస్ మిల్‌ను సందర్శించి ధాన్యం దిగుమతులపై సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్ నిర్వాహకులకు సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టెంట్లు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 30, ప్రతినిధి: నేడు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని శివ్వంపేట, కొంతన్‌పల్లి, సిరిపుర గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల పేదల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హత్నూర్ మండలం కోనంపేట్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే హత్నూర్ మండలం పల్పనూరు గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం ద్వారా నిరుపయోగ వస్తువుల విక్రయం

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 30, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం పరిధిలో ఉపయోగించిన, నిరుపయోగంగా ఉన్న నాలుగు ఇనుప బీరువాలు మరియు ఆరు ఇన్వర్టర్ బ్యాటరీలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వేలం మే 2, 2026 ఉదయం 11:30 గంటలకు ఐడీఓసీ (కలెక్టరేట్)లోని డీఎంహెచ్ఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర (అప్సెట్ ప్రైస్) నుంచి వేలం ప్రారంభమవుతుంది. వేలంలో పాల్గొనదలచిన వారు నిర్ణీత ఈఎండీ మొత్తాన్ని వేలం ప్రారంభానికి ముందు చెల్లించాల్సి ఉంటుంది. వేలంలో గెలిచిన వారు పూర్తి మొత్తాన్ని వెంటనే చెల్లించి, సంబంధిత వస్తువులను తమ ఖర్చులతో 24 గంటలలోపు కార్యాలయం నుంచి తరలించాల్సి ఉంటుంది. అవసరమైతే వేలాన్ని రద్దు చేయడానికి లేదా వాయిదా వేయడానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణకు పూర్తి అధికారాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## మొగుడంపల్లిలో జనగణన శిక్షణ ముగింపు – 37 మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



సందేశం టైమ్స్, మొగుడంపల్లి, ఏప్రిల్ 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 37 మంది ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించిన జనన–ఇళ్ల లెక్కింపు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సిద్ధారెడ్డి, రెవెన్యూ అధికారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొని సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు జనాభా నివాస గణనకు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేశారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు వచ్చే నెల మే 11వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి ఇళ్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుఖప్రసవం తల్లి, శిశువు క్షేమం



సందేశం టైమ్స్, ఆత్మకూరు, ఏప్రిల్ 30, ప్రతినిధి: ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపూరి గ్రామానికి చెందిన వెన్నమల్ల పార్వతి (భర్త వీరేందర్, వయస్సు 29)కు మూడవ కాన్పు సాఫల్యంగా నార్మల్ డెలివరీ ద్వారా జరిగింది. ఏప్రిల్ 29 ఉదయం 8 గంటల 25 నిమిషాలకు మగ శిశువు జన్మించగా, బిడ్డ బరువు 3 కిలోలుగా నమోదైంది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు బర్త్ డోస్‌గా బీసీజీ, హెపటైటిస్-బి, పోలియో చుక్కలు మరియు విటమిన్-కే ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఏఎన్ఎం మహబూబా, హెల్త్ అసిస్టెంట్లు కొండ శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## జుల్కల్ పరిశ్రమల్లో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలపై అవగాహన

సందేశం టైమ్స్, కంది, ఏప్రిల్ 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామంలోని ఎం.వై.కె కంపెనీ, యు.ఐ పైప్ ఫిట్టింగ్ కంపెనీలలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, మహిళా మరియు బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ సీహెచ్. ప్రసాద్ రావు ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా, కార్మికుల దోపిడీ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక దాడులు, సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అత్యావసర పరిస్థితుల్లో 100, 112, మహిళల హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఎస్ఐ ఎం.డి లాల్ అహ్మద్, మాణిక్ రెడ్డి, కంపెనీ యాజమాన్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజలకు సమృద్ధిగా తాగునీటి సరఫరా కల్పించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 30, ప్రతినిధి: జిల్లాలోని ప్రతి నివాస ప్రాంతంలో ప్రజల అవసరాలకు సరిపడా సమృద్ధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. వేసవి కాలంలో ఎక్కడా దాహర్తి సమస్య తలెత్తకుండా పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీవోలు తదితరులతో మంచినీటి సరఫరా స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా నీటి వనరులు, సరఫరా పరిస్థితులు, చేపట్టాల్సిన మరమ్మతులపై వివరాలు తెలుసుకున్నారు. రానున్న రెండు మూడు నెలలు కీలకమైనందున నీటి సరఫరాలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని చెప్పారు. బోరు బావులు, చేతి పంపులకు తక్షణ మరమ్మతులు చేసి ఫ్లషింగ్ చేయాలని, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, మారుమూల ప్రాంతాలకు కూడా రక్షిత తాగునీరు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును కఠినంగా పర్యవేక్షిస్తామని, నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ శిరీష, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసరావు, డీపీఓ యాదగిరి, అడిషనల్ డీఆర్డీఓ, ఎంపీడీవోలు, ఏఈలు, ఏపీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరెడ్డి ఆదిరెడ్డి ఆశయాలను సాధిద్దాం: మల్లు లక్ష్మి పిలుపు



సందేశం టైమ్స్, కోదాడ, ఏప్రిల్ 30, ప్రతినిధి: మునగాల పరగణ ప్రజల మన్ననలు పొందిన ప్రజానాయకుడు ముదిరెడ్డి ఆదిరెడ్డి ఆశయ సాధన కోసం యువత ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. కోదాడ పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆదిరెడ్డి 29వ వర్ధంతి సభ సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం. ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పేదలు, రైతులు అనేక కష్టాల్లో ఉన్న సమయంలో గ్రామసభలు నిర్వహించి వారిని చైతన్యం చేసి, ఇల్లు లేని వారికి బంజరాయి భూములను పంచిన చరిత్ర ఆదిరెడ్డిదేనని పేర్కొన్నారు. ఆయన ఎదుగుదలతో ఈ ప్రాంతంలో ఎర్రజెండా బలపడుతుందని భావించిన కొంతమంది అరాచక శక్తులు ఆయన్ని దారుణంగా హత్య చేశారని అన్నారు. అయితే ఆయనను చంపినా ఆశయాలను చంపలేరని, ఆయన రక్తపు ప్రతి బొట్టు వందమంది కార్యకర్తలకు సమానమని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రైతు సంఘం నాయకుడిగా, పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఆదిరెడ్డి రైతులు, పేదలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, వట్టెపు సైదులు, పట్టణ కార్యదర్శి ముత్యాలు, వి. నారాయణ, అనంతగిరి మండల కార్యదర్శి రాపోలు సూర్యనారాయణ, హుజూర్నగర్ రూరల్ మండల కార్యదర్శి పోస్సనబోయిన హుస్సేన్, పట్టణ నాయకులు షేక్ జానీ, ఎన్. పాపాచారి, జంగపల్లి, శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.